ప్రజాశక్తి

బుధవారం 31 జులై 2024

5

పార్వతీపురం మన్యం

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా విద్యాశాఖధికారి జి.పగడాలమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో ప్రవేశానికి 14 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఇంటర్ కోసం పదో తరగతి ఉత్తీర్ణత సాధించి 15ఏళ్లు నిండిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తును జూలై 31 నుండి ఆగష్టు 28 లోగా www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. రుసుం ఆగష్టు 28లోగా చెల్లించాలని తెలిపారు. రూ.200 ఆలస్య రుసుంతో సెప్టెంబర్ 4లోగా ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలన్నారు.

ఒకటో తేదీనే పింఛన్లు

ప్రజాశక్తి - పార్వతీపురం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు ఆగష్టు 1నే పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లుపై మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్లు పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేస్తామని, ఈ మేరకు అధికారులు, సిబ్బందికి తగు సూచనలు జారీ చేశామన్నారు. జిల్లాలో 1,43,398 పింఛన్లు ఉన్నాయని, వీటికి రూ.59.58 కోట్లు పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. కదల్లేక మంచానికే పరిమితమైన వారికి మొదటగా పంపిణీ చేయనున్నట్లు ఏర్పాట్లు చేశామన్నారు. గ్రామాల్లో దండోరా వేస్తున్నామని, సచివాలయం సిబ్బంది, ఎపిఎంలు, సిసిలు తదితరులను ఇందులో భాగస్వామ్యం చేస్తున్నామని చెప్పారు. జిల్లా అధికారులను మండల ప్రత్యేక అధికారులుగా నియమించామని ఆయన చెప్పారు. మొదటి రోజునే శతశాతం పంపిణీకి చర్యలు చేపడుతున్నామని ఆయన వివరించారు. అనివార్య కారణాల వల్ల ఏమైనా మిగిలితే రెండో రోజు పంపిణీ చేయనున్నట్టు ఆయన చెప్పారు. మొదటి రోజునే ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పొందాలని లబ్ధిదారులకు విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.

ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షణ చేయాలి

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ మొదటి రోజునే శత శాతం పంపిణీకి ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లుతో వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. బ్యాంకుల నుంచి నగదు పొంది సిద్ధం చేయాలని, ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్లు పంపిణీ ప్రారంభం కావాలని ఆయన ఆదేశించారు. గ్రామాల వారీగా సిబ్బంది మ్యాపింగ్ ఇప్పటికే పూర్తి కావడం జరిగిందని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పక్కా కార్యాచరణ ప్రణాళిక ఉండాలని, విజయవంతంగా ఒకటో తేదీన పంపిణీ పూర్తి చేసి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని ఆయన పేర్కొన్నారు. సిబ్బంది అందర్నీ సిద్ధం చేయాలని ఆయన అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు వై.సత్యం నాయుడు, కె.రామచంద్ర రావు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఆర్ ఐటిఐ హాస్టల్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

శిథిలావస్థలో ఉన్న రెసిడెన్షియల్ ఐటిఐ

భద్రగిరి ఆర్ ఐటిఐ విద్యార్థులు స్థానికంగా ఉండి చదువుకునేందుకు ఏర్పాటు చేసిన వసతి గృహం నేడు శిథిలావస్థకు చేరువలో ఉంది. గిరిజన విద్యార్థులకు సాంకేతిక విద్య అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ఐటిఐ వసతి గృహం నేడు సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భవనం లోపల భాగం పైకప్పు, పిల్లర్లు తడిసి పెచ్చులూడుతున్నాయి. దీంట్లో విద్యార్థులు క్షణక్షణం భయంతో ఉండాల్సి వస్తోంది. గతంలో ప్రభుత్వమే పోస్ట్ మెట్రిక్ హాస్టల్ ఏర్పాటు చేసి విద్యార్థులకు భోజనం అందించేది. కొంతకాలం తర్వాత భోజన సౌకర్యం ప్రక్రియ ఎత్తి వేయడంతో విద్యార్థులు స్థానికంగా ఉండి చదువుకునేందుకు ఆసక్తి తగ్గించారు. గతంలో 200మందికి పైగా విద్యార్థులు వసతి గహంలో ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 50లోపే ఉంది. విద్యార్థులకు ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో ఉండడానికి ఆసక్తి చూపడం లేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన కొంతమంది విద్యార్థులు సొంతంగా వండుకుని తరగతులకు హాజరవుతున్నారు.

హాస్టల్ ఆవరణలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

విద్యార్థులతో పాటు ప్రిన్సిపల్ కూడా హాస్టల్ లోనే ఉంటూ విధులకు హాజరవుతున్నారు. వసతి గృహం ఆవరణ చుట్టూ పిచ్చి మొక్కలు ఉన్నాయి. దీంతో పారిశుధ్యం లోపించింది. ఆసక్తి ఉన్న విద్యార్థులు వచ్చి చదువుకోవాలన్నా కనీస సౌకర్యాలు లేని పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి ఏజెన్సీలో పారిశ్రామిక విద్య, శిక్షణ పట్ల విద్యార్థులు ఆసక్తి చూపేలా భద్రగిరి ఐటిఐలో అన్ని రకాల వసతులు కల్పించి పూర్వ వైభవం తీసుకురావాలని ఈ ప్రాంత ప్రజలు, గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

నిరసననుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కర్యాదర్శి రెడ్డి వేణు

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు జరిగిన అన్యాయాన్ని వ్యతిరేకించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కేంద్ర ఆర్థిక మంత్రి ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో జిల్లాకు మంజూరైన నిధులు శూన్యమని, దీన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. మంగళవారం బెలగాం కూడలిలో సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌పై మాటలు ఘనం - నిధులు శూన్యంగా ఉందని, ప్రజలపై భారాలు వేసిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఖండించాలని పిలుపునిచ్చారు. బడ్జెట్‌లో జిల్లాలోని జంఝావతి, తోటపల్లి, గుమ్మడిగెడ్డ, పెద్దగెడ్డ తదితర నీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దును అనుసరించి మన్యం జిల్లాలో కబ్జాలు, ఆక్రమణ అయిన ప్రభుత్వ భూములపై ప్రత్యేక దర్యాప్తు జరిపి, దళితులు, గిరిజనులు, పేద బిసిలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజ ఆశలకు అనుగుణంగా బడ్జెట్ లేదన్నారు. ఈ బడ్జెట్లో గ్రాంటు కింద నిధులు వచ్చేలా కేంద్ర ప్రభుత్వం బిజెపిపై టిడిపి, జనసేన పార్టీలు, రాష్ట్ర ఎంపీలు ఒత్తిడి చేయాలని కోరారు. అభ్యుదయ వాదులు, మేధావులు రాష్ట్ర అభివృద్ధికి నిధుల సాధనకు డిమాండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు పలు ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామని కేంద్రమంత్రి పేర్కొనడం వల్ల రాష్ట్రానికి, రాజధానికి మేలు జరగదని, నేరుగా గ్రాంటుగా ప్రకటించాలని, ప్రత్యేక హెూదా ఊసే లేదని, రైల్వే జోన్, కడప ఉక్కు, మెట్రో, విద్య, వైద్య సంస్థలు తదితర చట్టబద్ధమైన హామీలు బడ్జెట్‌లో చోటు చేసుకోలేదని మండిపడ్డారు. పదేళ్ల నుంచి విభజన చట్ట ప్రకారం నిధులు కేటాయించకుండా బిజెపి నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.మన్మధరావు, కె.అవినాష్, వి.ఇందిరా, జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి, .ఇ.వెంకట రమణ, నాయకులు మర్రి శ్రీనివాసరావు, పి.రాజశేఖర్, వి.చిన్నంనాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు, పిఒకు ఆదివాసీ కాలచక్రాన్ని అందజేస్తున్న సన్యాసిరావు

పిల్లల భవిష్యత్తుపై అవగాహన కల్పించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన పిల్లలకు సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు వారి భవిష్యత్తుపైనా అవగాహన కల్పించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరుపుకోవడానికి మంగళవారం స్థానిక ఐటిడిఎలో గిరిజన సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, ఎన్జీవో సంఘాల ప్రతినిధులతో సమావేశం పిఒ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. ఆదివాసీ సముదాయానికి స్థలం గుర్తిస్తే ఆ స్థలం కేటాయించడానికి చర్యలు చేపడుతామన్నారు. అనంతరం పిఒ మాట్లాడుతూ పిల్లలను ఈ కార్యక్రమంలో భాగస్వామి చేయడానికి, భోజనం, రవాణా సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని అన్నారు. ఉద్యోగులకు ఆరోజు సెలవుపై సాధ్యాసాధ్యాలు పరిశీలించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఆహ్వాన పత్రికలు కూడా ఇస్తామని చెప్పారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తామని అన్నారు. గిరిజన సంఘ నాయకులు ప్రతినిధులు పంటలు, సంస్కతి, కట్టు బాట్లు నాగరికత గురించి వివరించారు. అనంతరం హాట్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు ఎమ్మెల్యే, పిఒలకు ఆదివాసీ కాలచక్రాన్ని మెమోంటో ద్వారా అందజేశారు. అనంతరం పిఒను డైరెక్టర్ సన్యాసిరావు, సిఇఒ బి.శంకరరావు కండువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎపిఒ గణేష్ పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి, రాష్ట్ర కార్యదర్శి తేజోవతి, నాయకులు బి.చంద్రరావు, మండల టిడిపి అధ్యక్షులు సవర తోట ముఖలింగం పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ కాదు సూపర్ ఫ్లాప్ హామీలు

ఎగ్గొట్టేందుకే బడ్జెట్ పెట్టని టిడిపి ప్రభుత్వం
మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే సూపర్ సిక్స్ హామీల అమలుపై అసలు రంగు బయటపడిందని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మంగళవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. టిడిపి ఇచ్చిన హామీలు సూపర్ ఫ్లాప్ హామీలను తేటతెల్లమైందని చెప్పారు. ఈ హామీలను ఎగ్గొట్టేందుకే ప్రభుత్వం ఇంతవరకు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేదన్నారు. పేదల అవసరాలకు అనుగుణంగా అమలు చేయనప్పుడు సంక్షేమ పథకాలు ఎందుకని ప్రశ్నించారు. గతంలో వైసిపి ప్రభుత్వం పాఠశాలలు తెరుచుకోగానే విద్యార్థులకు అమ్మఒడి పథకం కింద ఆర్థిక సహాయం అందజేసిందని చెప్పారు. 43లక్షల మంది తల్లులకు రూ.26వేల కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. పాఠశాలలు తెరిచి రెండు నెలలైనా టిడిపి ప్రభుత్వం ప్రకటించిన హామీ అమ్మకు వందనం ఎందుకు అమలు చేయలేదన్నారు. ప్రస్తుతానికి రాష్ట్రంలో కోటిమంది పిల్లలకు అమ్మకు వందనం పథకం కింద సాయం చేయాల్సి వుందన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలయినప్పుడు రైతులకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా ప్రశ్నించారు. గతంలో ఏ సంక్షేమ పథకం ఎప్పుడు అమలు చేస్తామో ముందుగా కేలండర్ విడుదల చేసినట్లు చెప్పారు. ఇప్పుడు టిడిపి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించి కేలండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. హామీలిచ్చి అమలు చేయకపోవడమే టిడిపి అసలు నైజమని ప్రజలకు రెండు నెలల్లోనే అర్థమైందన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రూ.14లక్షల కోట్ల అప్పు చేసినట్లు టిడిపి నాయకులు, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేశారని విమర్శించారు. వాస్తవానికి ఆర్బిఐ నిర్దేశించిన ఎఫ్ఆర్ బిఎం పరిమితికి లోబడే గతంలో అప్పులు తీసుకున్నట్లు చెప్పారు. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం చేసిన అప్పుల కన్నా 2019 నుంచి 2024 వరకు వైసిపి ప్రభుత్వం చేసిన అప్పులు తక్కువేనని కేంద్ర ప్రభుత్వం కూడా స్పష్టం చేసిందని తెలిపారు. రాష్ట్ర జిడిపిలో 4.5 శాతం అప్పులు వాడుకోవచ్చునని ఆర్బిఐ నిబంధనలు చెపుతున్నాయని, దానికి లోబడి వైసిపి ప్రభుత్వం 3.1 శాతం అప్పులు చేసిందని చెప్పారు. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఈ విషయాన్ని పార్లమెంటులో చెప్పారని గుర్తు చేశారు. అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం పాటించాల్సిన టిడిపి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని ఆరోపించారు. అధికారంలో వచ్చిన రెండు నెలల్లోనే వైసిపి నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు, హత్యలకు పాల్పడిందని రాజన్నదొర చెప్పారు.

నాబార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నాబార్డు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పట్టణంలోని ఎస్ఎన్‌పి కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన నాబార్డు కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రంలోని ఆశావహ జిల్లాలైన పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు నాబార్డ్ కొత్త కార్యాలయాలను మంజూరు చేసింది. ఈ మేరకు పార్వతీపురంలో కార్యాలయాన్ని ప్రారంభించేందుకు నాబార్డు అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. డిఎస్ దినేష్ కుమార్ రెడ్డిని నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారిగా నియమించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు బ్యాంకులు మంచి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. నీతి ఆయోగ్ మన్యం జిల్లాను ఆశావహ జిల్లాగా గుర్తించిందని, బ్యాంకర్ల మద్దతుతో సాధ్యమైన అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చని అన్నారు. జిల్లాలో భిన్నమైన భౌగోళిక పరిస్థితులున్నాయని, కొద్దిపాటి జీవనోపాధి కార్యక్రమాలు, తదితర అంశాలున్నాయని ఆయన అన్నారు. జిల్లా అన్ని రంగాల్లో రాణించి మిగతా జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని, ఇందుకు నాబార్డు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో నైపుణ్య శిక్షణా కార్యక్రమం చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాబార్డు ఎపి రీజియన్ సిజిఎం ఎంఆర్ గోపాల్, శ్రీకాకుళం డిసిసిబి సిఇఒ వర ప్రసాద్, ఎపిజివిబి ఆర్ఎం ఆర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నడుకూరులో వైద్య శిబిరం

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని నడుకూరులో మంగళవారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివ్వాం బాధితులకు న్యాయం జరిగే వరకూ దీక్షలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

శివ్వాం దళితులు, జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బిసి పేదల భూసమస్యల పరిష్కారం జరిగేంత వరకు కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష శిబిరం కొనసాగించాలని గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కమిటీలు నిర్ణయించినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యలపై సోమవారం జరిగిన చలో కలెక్టరేట్లో కార్యక్రమం సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారని, వెంటనే పరిష్కరించాలని కోరుతూ న్యాయం జరిగే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. తొలుత పార్వతీపురం మండల తానవలస గ్రామానికి దళితులు దీక్షల్లో పాల్గొంటారన్నారు. ఆ తర్వాత రోజుకు ఒక మండలానికి చెందిన సంఘ నాయకులు దీక్షలో పాల్గొంటారని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రావికోన సర్పంచ్ కె రామస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.రాము, లక్ష్మణ తెలిపారు. సమస్య పరిష్కారమయ్యే వరకు శాంతియుతంగా జరిగే ఈ దీక్షకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు.

కలెక్టర్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఒట్టిగెడ్డ రిజర్వాయర్‌లో పూడిక తొలగించాలి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని ప్రధాన సాగునీటి వనరైన ఒట్టిగెడ్డ రిజర్వాయర్లో పూడికలు తీయడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో కుడి, ఎడమ ప్రధాన కాలువలతో పాటు అనుబంధ పిల్ల కాలువల్లో పూడికలు పేరుకుపోయాయి. దీన్ని తొలగించకుంటే సాగునీటికై ఈ ఏడాది మండలంలోని రైతులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందని మంగళవారం స్థానిక ఎంపిపి బొంగు సురేష్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు దత్తి లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, దాసరి రామారావు, బడే సత్యం నాయుడు తదితరులు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌ను కలిసి రిజర్వాయర్ పరిస్థితిని వివరించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వీలైనంత తొందరగా సంబంధిత పూడికతీత పనులు పూర్తి చేసేందుకు హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

చోడి సాగును పరిశీలిస్తున్న డిపిఎం షన్ముఖరావు

చిరు ధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి : డిపిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని జట్టు సంస్థ ఎపిసిఎన్ఎఫ్ (ప్రకృతి వ్యవసాయం) సంయుక్తంగా రాయగడ జమ్ములో అమలు చేస్తున్న రైతులు పువ్వుల రామారావు, పువ్వుల దన్ను శ్రీరాగిలో అంతర్ పంటలు, చింతలపాడులో పత్తిక హైమావతి జీడిలో అంతర పంటలు, తోయక తారమ్మ, శ్రీరాగి పంటలను జిల్లా ప్రకృతి వ్యవసాయం మేనేజర్ పి.షణ్ముఖరాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పోడు, మెట్టు భూముల్లో రాగులు, జొన్నలు, సజ్జలు, ఆరికలు, గంటేలు, సామలు, ఊదలు చిరుధాన్యాలు వేసుకోవడం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గించుకొని అధిక బడులు సాధించవచ్చు అన్నారు. వాతావరణ పరిస్థితులను, పురుగులు, తెగుళ్ల తట్టుకునే శక్తి కలిగి ఉంటాయని, ప్రాముఖ్యత రైతులు గుర్తించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. వరి కంటే చిరుధాన్యాలకే మార్కెట్లో ఎక్కువ విలువ ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో షుగర్, బీపీ, రక్త హీనత మొదలగు వ్యాధుల నివారణకు ఇవి ఉపయోగపడతాయని, అన్ని రకాల పోషకాలు చిరు ధాన్యాల్లో లభ్యమవుతాయనీ, కనుక ప్రతి రైతు తమకున్న విస్తీర్ణంలో తప్పని సరిగా వేసుకోవాలని సూచించారు.

జీడిలో అంతర్ పంటలు వేసుకోవడం వల్ల మొక్కల్లో జీవ వైవిధ్యం పెంపొందిస్తామన్నారు. జిల్లాలోని 15 మండలాల్లో చిరు ధాన్యాలు సాగు విస్తీర్ణం పెంచే ప్రయత్నాలు చేయడం జరుగుతుందని, కార్యకర్తలు రైతులకు అందుబాటులో ఉండి తగు సూచనలు సలహాలు అందివ్వాలని, రైతు సేవా కేంద్రాల్లోని సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ ఉన్నారు.

తూనికలు, కొలతల శాఖ అదనపు వసూళ్లు

నష్టపోతున్నామంటున్న వ్యాపారులు, వినియోగదారులు

ప్రజాశక్తి - కురుపాం

బరువు తూచే యంత్రాల మరమ్మతు, యంత్రాలు సరిచూసి అధికారుల ఆమోదంతో ధ్రువీకరించేందుకు కొందరికి తూనికలు, కొలతల శాఖ అనుమతులు ఇస్తోంది. ఇవి పొందిన లైసెన్సుదారులు ఆయా ప్రాంతాల్లో వ్యాపారులు బరువు తూచే యంత్రాలను ఏటా మరమ్మతు చేసి తనిఖీ అధికారి ద్వారా ధ్రువీకరించి వ్యాపారికి ధ్రువపత్రం ఇవ్వాలి. ఈ క్రమంలో తనిఖీ అధికారి యంత్రాన్ని పరిశీలించి అంతా సక్రమంగా ఉంటే సీలు వేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అధికారుల తనిఖీల సమయంలో బరువు తక్కువగా చూపి వినియోగదారులను మోసగిస్తున్నట్లు గుర్తిస్తే వ్యాపారితో పాటు సదరు యంత్రం తనిఖీ చేసిన లైసెన్సుదారు, తయారీదారుపై చర్యలు తీసుకోవాలి. ఇందుకు విరుద్ధంగా వ్యాపారులపై కేసులు నమోదు చేసి లైసెన్సుదారులను వదిలేస్తున్నారు. బరువు తూచే యంత్రాల పరిశీలన, మరమ్మతు, తనిఖీలు చేసే లైసెన్సుదారులు కొందరు మధ్యవర్తిగా ఉంటూ వసూళ్లకు పాల్పడుతున్నారని మంగళవారం కురుపాంలో ఇలా కొందరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద నుంచి రూ.100, 200 అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. అయితే అధికారే అదనంగా వసూలు చేశామని సదరు లైసెన్సుదారుడు కె.శ్రీనివాసరావు అంటున్నారు. దీనిపై తూనికలు, కొలతల శాఖ అధికారి వద్ద వివరణ కోరగా, వసూలు చేస్తున్నట్టు ఇప్పటికే పలువురు ఫిర్యాదు చేశారని, వసూలు చేసిన నగదును తిరిగి ఇప్పిస్తున్నామని, విచారణ జరిపి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

నేడు విఆర్ఎస్ నీరు విడుదల

ప్రజాశక్తి - మక్కువ

మధ్య తరహా సాగునీటి ప్రాజెక్ట్ వెంగళరాయ సాగర్ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టు భూములకు బుధవారం మధ్యాహ్నం నీరు విడుదల చేయనున్నట్లు మండల టిడిపి అధ్యక్షులు జి.వేణుగోపాల్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. ఉదయం 10 గంటలకు విడుదల చేయాలని నిర్ణయించినప్పటికీ మంత్రి సంధ్యారాణి అమరావతి నుండి రావడానికి సమయం పట్టడంతో మధ్యాహ్నానికి వాయిదా వేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు బేబినాయన, బోనెల విజయచంద్ర పాల్గొంటారని ఆయన తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల వేతనాలు పెంచాలని, విద్యార్థులకు ఇస్తున్న మెనూ చార్జీలను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. లేనిచో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం నాయకులు పావని, గౌరమ్మ, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సేవలో సర్పంచ్

ప్రజాశక్తి - బలిజిపేట

కాలువల్లో దోమల మందు పిచికారీ చేస్తున్న సర్పంచ్ పాపారావు

గ్రామస్తులకు సేవ చేయడంలో ఆ గ్రామ సర్పంచి ఎలాంటి బేషజాలకు పోకుండా ముందుంటున్నారు. ఆఖరు కాలువల్లో దోమల మందు పిచికారీ కూడా ఆయనే స్వయంగా చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని పెదపెంకి సర్పంచి నగిరి పాపారావు తన గ్రామంలో తాను సేవ చేయడానికి సిగ్గుపడాల్సిన పనిలేదని, తనను తాను తగ్గించుకుంటూ గ్రామంలో ఉన్న కాలువల్లో పేరుకుపోయిన దోమలను నివారించడానికి దోమల మందును స్ప్రేయర్ ట్యాంక్‌తో స్ప్రేయింగ్ చేస్తున్నాడు. ఎక్కువ జనాభా కలిగిన మండలంలోని పెద్ద పంచాయతీలో ఏ మాత్రం సిగ్గు పడకుండా సర్పంచ్ ఈ పనులు చేయడం పట్ల గ్రామ పెద్దలు ప్రజలు వర్షం వ్యక్తం చేశారు.

మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పార్వతీపురం కేంద్రంలో వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకు ఎఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బి.రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది పేద, బడుగు, బలహీనవర్గ విద్యార్థులు ఈ ప్రాంతంలో మెడికల్ కళాశాల లేక దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే మన జిల్లా వైద్యరంగంలో వెనుకబడి ఉందని, కావున కాలేజీ ఏర్పాటు వల్ల భవిష్యత్తులో పేద ప్రజలకు, విద్యార్థులకు ఎంత ఉపయోగపడుతుందని అన్నారు. ఎక్కువ మంది విద్యార్థులకు ఉపయోగపడేలా కాలేజీ నిర్మాణం చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ హరికృష్ణ, నాయకులు వికాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలను నివారించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని గిరిజన విద్యా సంస్థల్లో ప్రతి ఏటా పదుల సంఖ్యలో గిరిజన విద్యార్థులు మరణిస్తున్నారని, ఈ విద్యా సంవత్సరం ఇప్పటికే నలుగురు గిరిజన విద్యార్థులు మృతి చెందారని, ఈ నేపథ్యంలో గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఐటిడిఎ పిఒ సేథు మాధవన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ మరణించిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో మాదిరిగా ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని నియమించి గిరిజన విద్యార్థులకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గిరిజన విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాలు పెట్టని మక్కువ మండలం ఎర్ర సామంత వలస గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డెప్యూటీ వార్డెన్లపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

పిఒకు మొక్కను అందజేస్తున్న గిరిజనాభ్యుదయ సంఘ నాయకులు

ఐటిడిఎ పిఒను కలిసిన గిరిజనాభ్యుదయ సంఘ నాయకులు

ప్రజాశక్తి - కురుపాం

కొత్తగా ఐటిడిఎ పిఒగా బాధ్యతలు స్వీకరించిన సేతు మాధవన్‌ను గిరిజనాభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్, సంఘ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో గల గిరిజన గ్రామాలకు విద్య, వైద్య, తాగునీరు, రహదారులు, వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని కోరారు. వ్యవసాయ రంగంలో గిరిజన రైతులకు వ్యవసాయ పరికరాలు రాయితీ ద్వారా మంజూరు చేస్తూ గిరిరైతులకు చేయూతనివ్వాలని, వెలుగు ద్వారా గిరిజన స్వయం సహాయక సంఘాలకు వెలుగునిచ్చే పథకాలు మంజూరు చేసి ఆర్థికాభివద్ధికి, గిరిజన నిరుద్యోగ యువతీయువకులు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధి అవకాశాలను కల్పించి వినతి పత్రం అందజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పల్ల సురేష్, టిఆర్ఎఫ్ నాయకులు రొబ్బ లోవరాజు, ఐ.రామకష్ణ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ సాయి కౌశిక్

హాల్ మార్క్‌పై అవగాహన

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

జిల్లాకు చెందిన బంగారు వర్తకులకు మంగళవారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో హాల్ మార్క్ విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సాయి కౌశిక్ కళ్ళే బి ఐ ఎస్ సంస్థ గురించి హాల్ మార్కింగ్ పథకం 2000 గురించి, బంగారం అమ్మకాల్లో పాటించాల్సిన స్వచ్ఛత, సవ్యత గురించి వివరించారు. వినియోగదారులను తప్పు త్రోవ పట్టించేలా బంగారు అభర ఆభరణాల వ్యాపారులు ప్రవర్తిస్తే అందుకు బిఐఎస్ విధించే జరిమానాల గురించి వివరించారు. బంగారు వర్తకుల సంఘం అధ్యక్షుడు ఇందుపూరు గోపాలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాలూరు, పాలకొండ, వీరఘట్టం, పార్వతీపురానికి చెందిన బంగారు వర్తకులు షరాబులు పాల్గొన్నారు.

నల్లత్రాచు హల్‌చల్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలోని తెలగవీధిలో ఉంటున్న పి.కొండలరావు ఇంటి సమీపాన మంగళవారం సాయంత్రం ఆరు అడుగుల నల్లత్రాచు పాము కనిపించింది. పాము రాకని గమనించడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. కుటుంబ సభ్యులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. వర్షాకాలం కావడంతో ఇళ్ల పెరట స్థలాలు, పొలాల వద్ద ఇటువంటి పాములు కనిపిస్తూ ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు. పొలం పనులకు వెళ్లే వారంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

పిఒతో చర్చిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పిఒ హామీతో సిఆర్‌టిల
రిలే నిరాహార దీక్షలు వాయిదా

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక ఐటిడిఎ పరిధిలోని సిఆర్‌టిలందరినీ రెన్యువల్ చేయాలని కోరుతూ గత వారం రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు చేపట్టిన సేతు మాధవన్ హామీ మేరకు రిలే నిరాహార దీక్షలు వాయిదా వేసినట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి రమేష్ ఎస్ మురళీమోహనరావు తెలిపారు. ఎగ్రెనెస్ట్ ఎస్‌జిటిలో సిఆర్‌పిల రెన్యూవల్స్ అధికారులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటానని పిఒ హామీ మేరకు తాత్కాలికంగా పోరాటాన్ని వాయిదా వేస్తున్నట్లు వారు ప్రకటించారు. మంగళవారం పిఒను ఆయన కార్యాలయంలో యుటిఎఫ్ నాయకులు కలిసి ప్రభుత్వం ఇచ్చిన గైడెన్స్ న కోర్టు ఉత్తర్వులను గత సంవత్సరం ఆర్డర్ కాపీలను చూపించి ఆయనకు వివరించామని తెలిపారు. అలాగే 130 ఖాళీలు ఉన్నాయని ఉపాధ్యాయులు లేక స్కూల్లు మూతలు పడుతున్నాయని పిఒ దృష్టికి తీసుకువెళ్లామని, దీనికి ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని సానుకూలంగా స్పందించిన ఆయనకు సీఆర్టీ లు, యుటిఎఫ్ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.

చుక్క నీరివ్వని రక్షిత నీటి పథకం

ప్రజాశక్తి - వీరఘట్టం

పేరుకే తప్ప ఎందుకూ ఉపయోగపడని ఉత్సవ విగ్రహంలా ఉంది మండలంలోని చలివేంద్రి రక్షిత మంచినీటి పథకం. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీరు సౌకర్యం కల్పించాలని ఉద్దేశ్యంతో 2018-19 అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో 90వేల లీటర్ల సామర్థ్యంతో సుమారు రూ.30 లక్షల అంచనా వ్యయంతో నాబార్డ్ నిధులతో గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేశారు. రక్షిత మంచినీటి పథకం ఏర్పాటుతో పాటు సమీపంలో 60 అడుగులో ఉన్న బావికి మోటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఇవన్నీ చెప్పుకోవడానికే తప్ప కనీసం చుక్క నీరు రావడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవకాశం ఉన్న వారు మోటార్ల ఏర్పాటు చేసుకుంటున్నారు. అవకాశం లేని వారు ప్రభుత్వం ఏర్పాటు చేసే మంచినీటి బోరు బావులపై ఆధారపడి కాలం వెలదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సింగిల్ పైపు లైన్ ఏర్పాటు చేసి మూడు కుళాయి పాయింట్లు ఏర్పాటు చేయాలనుకున్నప్పటికీ ఆ దిశగా ప్రణాళికలు జరగలేదని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చెబుతున్నారు. ఏడాది కిందట జిల్లా పరిషత్తు నుంచి లక్ష రూపాయల అంచనా వ్యయంతో రక్షిత మంచినీటి పథకం వద్ద కొన్ని కుళాయి పాయింట్లు ఏర్పాటు చేసి కొద్దిరోజుల వరకు నీరు సరఫరా చేశారు. రెండు నెలల నుంచి వీటి ద్వారా కూడా నీరు రాకపోవడంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రజలకు రక్షత మంచినీటి పథకం ద్వారా గుక్కెడు నీరిచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ప్రశ్నించగా, చలివేంద్రికి జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.16 లక్షలతో ఇంటింటికి కుళాయి పాయింట్ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు చెబుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న రక్షిత మంచినీటి పథకం

పనులు చేయకుండా బిల్లులు స్వాహా

వీరఘట్టం : గ్రామాల్లో వైసిపి సర్పంచులు అభివృద్ధి పనులు చేయకుండానే బిల్లులు నొక్కేస్తున్నారని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన సంయుక్త కార్యదర్శి జనసేన జానీ అన్నారు. వైసిపి సర్పంచుల పాలన ఒక విచిత్రంగా ఉందని, వంద రూపాయలు బల్బు కొనుగోలు చేస్తే వెయ్యి రూపాయలు బిల్లు పెడుతున్నారని, ఎక్కడ కూడా సమావేశాలు, తీర్మానాలు లేవని అన్నారు. అభివృద్ధి పనులు చేసినట్టు అడ్డగోలుగా బిల్లులు చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఆయా పంచాయతీలపై విచారణ జరిపితే అవినీతి బయటపడుతుందన్నారు. సర్పంచుల అవినీతి బయటపడాలంటే తప్పనిసరిగా విచారణ జరిపించాలని జానీ డిమాండ్ చేశారు.

వేప గింజల కషాయంతో పురుగుల నివారణ

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు పర్యావరణానికి హాని చేయకుండా, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితం పొందేలా ఆలోచనలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్ అన్నారు. మండలంలోని అమ్మవలసలో రైతులకు వేపగింజల కషాయం తయారీ, వినియోగంపై ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదు శాతం వేప గింజల కషాయం ఉపయోగిస్తే గుడ్డు దశ నుంచే పురుగులను నివారిస్తుందని, గులాబీ రంగు కాయితలు పురుగు నివారణ, రసం పీల్చు పురుగుల నివారణకు నేరుగా రసాయనాలకు పోకుండా ముందుగా వేప గింజల కషాయాన్ని తయారు చేసుకుని పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం ఐదు శాతం వేపగింజల కషాయం తయారీ విధానాన్ని చేసి చూపారు. లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల వేప కషాయాన్ని కలిపి పత్తి పంటపై పిచికారీ చేసినట్లయితే గులాబీ రంగు పురుగు, ఇతర రసం పీల్చు పురుగులను నివారించు కోవచ్చునని తెలిపారు. అనంతరం పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ విధానాలను చేపట్టడం ద్వారా సహజ మిత్ర పురుగులను పెంచుకోవచ్చని, దీనికిగాను పత్తిలో పలు పంటల విధానాన్ని అవలంభించాలని అన్నారు. పత్తి చుట్టూ రెండు, మూడు వరసల్లో ఆముదం, మొక్కజొన్న, బంతిపూలను గట్లపై నాటుకోవాలని తెలిపారు. దీని ద్వారా పురుగు ఉనికిని ముందుగానే గ్రహించి నివారణా చర్యలు చేపట్టవచ్చని తెలిపారు. అనంతరం డ్వాక్రా సంఘాలతో సమావేశమైన తర్వాత చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు. కార్యక్రమంలో సాలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్ రావు, ఎఒలు తిరుపతి నాయుడు, అనురాధ, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

పత్తిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్

బుడ్డిపేటలో పొలంబడి

సీతానగరం : మండలంలోని బుడ్డిపేటలో వ్యవసాయంలో మెలైన పద్ధతులు జిఏపి పొలంబడి కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి అవినాష్ సమక్షంలో బొత్స లక్ష్మునాయుడు పొలంలో బిపిటి 3291 సోనామసూరి రకం తాడు ఉడుపు పద్ధతిలో ఉడుపులు వేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ మాట్లాడుతూ ఈ పద్ధతిలో రైతులు నాట్లు వేయడం వల్ల చీడపీడల ఉధృతి తగ్గి వరి దుబ్బులకు అధిక పిలకలు పెరుగుతాయని తెలిపారు. ఈ పద్ధతిలో మొక్క మొక్కకు దూరం 15సెంటీమీటర్లు, వరుసకు వరుసకు మధ్య 20సెంటీమీటర్ల దూరంతో తూర్పు, పడమర దిశగా ఉడవడం వల్ల గాలి, వెలుతురు తగిలి పైరు ఆరోగ్యవంతంగా పెరుగుతుందని అన్నారు. అలాగే బుద్ధిపేటలో బీపీటీ3291 రకం వేసిన రైతులను ఎంపిక చేసి సర్టిఫికేట్ చేస్తామన్నారు. ఈ పద్ధతిలో ఎరువులు, పురుగు మందులు తగ్గించి పంట పండించడం వల్ల రైతులకు ఒక సర్టిఫికేట్ చేసి వారు పండించిన పంటను మార్కెట్‌లో ఎక్కువ ధరకు అమ్మేలా, పంట అధిక ధర పలుకుతుందని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ గ్రామ వ్యవసాయ సహాయకులు పి.లక్ష్మణ్, బి.సుధీర్, ఎం.గౌరి, బి,సునీత, వినయ్, రైతులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిని తనిఖీ చేసిన డిఎంఒ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో ధోనుభాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి వై మణి మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను, మందులను పరిశీలించారు. మలేరియా కేసుల వివరాలు సేకరించారు. అనంతరం జయ పురంలో జరుగుతున్న మెడికల్ క్యాంపును సందర్శించారు. మలేరియా కేసుల గురించి తెలుసుకున్నారు ఇంటింటికి వెళ్లి రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. అనంతరం ఐటిడిఎ పిఒ రాహుల్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమె వెంట వైద్య అధికారి భాను ప్రతాప్, శ్రీకాంత్, సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీని పట్టి పీడిస్తున్న డంపింగ్ యార్డు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన అజెండాలోని అంశాలపై జరిగిన చర్చ సందర్భంగా మాట్లాడుతూ డంపింగ్‌యార్డుకు స్థలాన్ని సేకరించాలని, ఇందు కోసం కౌన్సిల్ సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు, వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మండల అధికారులు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారావును అప్పగించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రకాశం జిల్లా టంగుటూరులోని రొయ్యల కంపెనీ వద్ద పనుల కోసం వెళ్లి తప్పిపోయిన బద్నాన చిన్నారావును కుటుంబ సభ్యులకు అప్పగించాలని, ఎవరికీ తెలియకుండా తీసుకెళ్లిన రొయ్యల కంపెనీ గుమస్తా శ్రీకాకుళం జిల్లాకు చెందిన కృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు జన్ని రామయ్య, కోరాడ ఈశ్వరరావు, నిర్వాసిత గిరిజన మత్స్యకారుడు బద్నాన జోగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. ప్రకాశం జిల్లా టంగుటూరు వద్ద సంధ్య ఆక్వా రొయ్యల కంపెనీ గుమస్తా కృష్ణ అనే వ్యక్తి కోడి కాలువలసకు చెందిన పుష్పారావు అనే గిరిజనుడు సహకారంతో 25 రోజుల క్రితం ఎర్రడ్లవలస నుంచి బద్నాన చిన్నారావును తీసుకెళ్లారని కుటుంబ సభ్యులకు తెలియకుండా చెప్పకుండా తీసుకువెళ్లిన రెండు రోజులకే రొయ్యల కంపెనీ వద్ద చిన్నారావు తప్పిపోయాడని తెలిసిందని తెలిపారు. అప్పటికే చుట్టుపక్క గ్రామాలు వెతికినా దొరకకపోవడంతో శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చిన వ్యక్తి పుష్పరావు సహకారంతో తీసుకువెళ్లాడని తెలిసి తొలుత పాచిపెంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఇక్కడి పోలీసుల సలహాతో ప్రకాశం జిల్లా టంగుటూరు పోలీస్ స్టేషన్ కూడా తప్పిపోయిన చిన్నారావు ఫోటో ఇచ్చి ఫిర్యాదుచేశామన్నారు. తప్పిపోయిన తన అన్న చిన్నారావును తెప్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. పనుల్లేక బతకడం కోసం వెళ్లిన గిరిజన పేదలు తీవ్రమైన కష్టాలు పడుతున్నారని, వారికి ఎటువంటి భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి న్యాయం చేయాలని, చిన్నారావును వెతికి పెట్టి కుటుంబానికి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లను స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మంగళవారం పంపిణీ చేశారు. ఈ కాలేజీలో చదువుతున్న 540 మంది విద్యార్థులకు, 350మంది బాలికలకు ఈ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న ఈ పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, వీటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ హరిగోపాల్ కాలేజీలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా కళాశాలలో కంప్యూటర్ లేబొరేటరీ, కంప్యూటర్ సైన్స్, ఒకేషనల్ విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు బయట నేర్చుకోడానికి వెళ్లడం వ్యయంతో కూడిన పని అని, కావున వారికి అవసరమైన కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ విషయంపై తక్షణమే ఉన్నతాధికారులకు తెలియజేసి తొందర్లో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు గండి రామునాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు ఫుంటా సంతోష్, కళాశాల ఎఐఎంఒ పైలా శంకర్రావు, వ్యాయామ అధ్యయన అధ్యాపకులు నాగభూషణరావు, లైబ్రరీ ఇన్చార్జ్ అన్నపూర్ణ, సిమ్మా రవికుమార్. పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ బాధితులకు పరిహారం

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

హిట్ అండ్ రన్ (గుర్తు తెలియని వాహనాలు ఢీకొన్న) కేసుల్లో బాధితులకు పరిహారం అందించనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి జె.కేశవనాయుడు తెలిపారు. మంగళవారం కలెక్టరు కార్యాలయంలో ఆయన చాంబరులో రెవెన్యూ, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హిట్ అండ్ రన్ కేసుల్లో మరణించిన వారి కుటుంబీలకు రూ.రెండు లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50వేలు పరిహారం అందించబడుతుందని తెలిపారు. ఆ తర్వాత వాహనం గుర్తించినట్లయితే ఇన్సూరెన్స్ కూడా క్లెయిం చేసుకొనవచ్చునని, చాలామంది బాధితులు ఇన్సూరెన్స్ క్లెయిం చేసేందుకు వీలుపడదనే ఉద్దేశంతో హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు కేంద్రప్రభుత్వం అందించే పరిహారం క్లెయిం చేసేందుకు ముందుకురావడం లేదన్నారు. న్యాయ సేవాధికార సంస్థ వారు బాధితులకు అవగాహన కల్పించి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని, కావున జిల్లాలో నమోదైన 13 హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులను ఆగష్టు 2ను కలెక్టరేట్‌కు తీసుకురావాలని, వారికి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డిఒ కె.హేమలత, సిఐలు కృష్ణారావు, సత్యనారాయణ, ఎస్ఐ కె.ప్రయాగమూర్తి పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పక్షోత్సవ ర్యాలీలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని నిడగల్లు, వెంకటాపురం, లక్ష్మీపురం, చల్లంనాయుడువలస తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య వారోత్సవాల ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ మాట్లాడుతూ అన్ని గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య పక్షోత్సవంలో భాగంగా నీళ్ల ట్యాంకులు పరిశుభ్రత, కాలువల్లో పూడికతీతలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఒడిఎఫ్ మరుగుదొడ్లపై సర్వే చేస్తామన్నారు. అన్ని గ్రామాల్లోనూ ఈ కార్యక్రమం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు పి.వెంకటలక్ష్మి, వెంకట నాయుడుతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేట: గ్రామాల్లో పారిశుద్ధ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఇఒ-1 సామల సింహాచలం అన్నారు. మంగళవారం ఆయన సుభద్ర, శివరాంపురం, పణుకుపేటలో పారిశుద్ధ్య వారోత్సవాల సందర్భంగా సూపర్ వైజరీ అధికారిగా సందర్శించి ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల పరిస్థితులను పరిశీలించారు. ముందుగా సుభద్రలోని కాలువల్లో పూడికలను, వీధులు, గ్రామ కూడళ్ల దగ్గర ఏర్పడిన చెత్తా చెదారాలను, వ్యర్థాలను తీయించారు. గ్రామంలో గల వాటర్ ట్యాంక్‌ను పరిశీలించి చుట్టూ ఉన్న మొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అలాగే సచివాలయ ఉద్యోగ సిబ్బంది, గ్రామస్తులతో కలిసి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం శివరాంపురం, పణుకుపేట గ్రామాల్లో పర్యటించి ప్రజలతో సమావేశమై పారిశుధ్యం పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో సర్పంచులు సింహాచలం, శ్రీనివాస రావు, పంచాయతీ కార్యదర్శులు గణేష్, క్రాంతి కుమార్, సచివాలయ ఉద్యోగులు, వైద్యశాఖ,ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీతానగరంలో ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఒ పగడాలమ్మ

కెజిబివి పాఠశాలను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కాశీపట్నం పంచాయతీలో ఉన్న కస్తూరిబా పాఠశాలను డిఇఒ జి.పగడాలమ్మ ఆకస్మికంగా సందర్శించారు. మంగళవారం ఆమె స్థానిక స్పెషలాఫీసర్ దుర్గా, ఇతర సిబ్బందితో చర్చించారు. పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో ఇబ్బందులుపడాల్సి వస్తోందని స్పెషల్ ఆఫీసర్ దుర్గ విన్నవించారు. ప్రహరీగోడ అంశం ప్రస్తుతం తమ పరిశీలనలో ఉందని త్వరలో మంజూరు చేస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థినీలు ఎక్కువ మార్కులు సాధించేలా చదవాలని ఆమె సూచించారు. భోజన సౌకర్యాలపై విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. అంతా సక్రమంగా ఉన్నాయని విద్యార్థినిలు ఆమెకు తెలిపారు.

రోడ్ల భద్రతపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

రహదారిభద్రత వారోత్సవాలు సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ ఎల్.దాలినాయుడు అధ్యక్షతన మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎ.వరప్రసాద్, విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలు, వాహనం నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రమాదాలు ఎదురైనప్పుడు ప్రథమ చికిత్స చేయు విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1,2 పిఒలు డి.రామకృష్ణ, బి.అనురాధ, భౌతిక శాస్త్ర అధ్యాపకులు జి.ప్రదీప్, బి.ప్రదీప్ కుమార్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులో 7 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బత్తిలిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒడిశా నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ప్రైవేట్ బస్సులో 7 కేజీల గంజాయి లభించినట్లు ఎస్ఐ సిహెచ్ ప్రసాద్ తెలిపారు. బస్సులో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న ఇద్దరు వ్యక్తులు పదంపూర్ బ్లాక్, కేంద్రిగూడకు చెందిన వారని తెలిపారు. పూర్తి వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా : ఒకరు మృతి

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని అంటిపేట సమీపాన మంగళవారం ఆటో బోల్తా పడి ఒకరు ఎ.పైడిరాజు (25) మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లచ్చయ్యపేటకు చెందిన సిహెచ్ చిన్నారావుతో మరో ఐదుగురు చినబోగిల వెళ్లేందుకు ఆటోలో బయులుదేరారు. అంటిపేట సమీపాన ఓ మలుపు వద్ద ఆటో వేగాన్ని నియంత్రించే సమయంలో సడన్ బ్రేక్ వేయడంతో బోల్తా పడింది. పక్కన ఉన్న పొలంలోకి మూడు పల్టీలు వేయడంతో పైడిరాజుపై ఆటో పడింది. వెంటనే స్థానికులు క్షతగాత్రులను బొబ్బిలి ప్రభుత్వాసుపత్రి తరలించారు. తీవ్రంగా గాయాలైన పైడిరాజు, చిన్నారావు, శంకర్రావును విజయనగరం ప్రభుత్వాసుపత్రి తరలించాలని వైద్యులు రిఫర్ చేశారు. మార్గమధ్యలో పైడిరాజు మృతి చెందాడు. క్షతగాత్రులంతా లచ్చయ్యపేటకు చెందిన వారే. ఎస్సై రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.